# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-04-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఉగ్రవాదానికి భారత్ ఎన్నటికీ తలవంచబోదని స్పష్టం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ.**

**2. జనాభా నిర్వహణతో పాటు పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

**3. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వారోత్సవాల్లో పాల్గొన్న ఒడిషా గవర్నర్ కంభం పాటి హరిబాబు.**

**4. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్.**

**5. వృద్ధాప్య సమస్యలతో మృతి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు.**

==========================

జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు ఈ రోజుతో ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. 2025 ఏప్రిల్ 22న ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారిని స్మరించుకుంటున్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు దేశం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒక దేశంగా దుఃఖంలోనూ, సంకల్పంలోనూ ఐక్యంగా నిలబడ్డామన్నారు. ఉగ్రవాదానికి భారతదేశం ఎన్నటికీ తలవంచదని, ఇటువంటి హేయమైన చర్యలు ఎన్నటికీ సఫలం కావని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

గతేడాది ఏప్రిల్ 22న దక్షిణ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో 26 మంది మృతి చెందారు.

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు అంశాలపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జనాభా నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో జనాభా సమతుల్యత కోసం జనాభా నిర్వహణకు కొత్త విధానాలు, ప్రోత్సాహకాలు వంటి అంశాలపై ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం సంజీవని ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి

చర్చించనున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న శతాబ్ది వారోత్సవాల్లో ఒడిషా గవర్నర్ కంభం పాటి హరిబాబు ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ఆయన అధ్యాపకులను జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది విద్యార్థులను ఆంధ్రా విశ్వవిద్యాలయం తీర్చిదిద్దిందని తెలిపారు. ఈ విశ్వ విద్యాలయంలో తాను కూడా ఒక విద్యార్థి అని గుర్తు చేసుకుంటూ..

..వాయిస్.. 25 సెకన్లు

---------------------------

సింగపూర్ లో రాష్ట్ర మంత్రుల బృందం పర్యటన కొనసాగుతోంది. ప్రజలకు మెరుగైన పాలన, ఉత్తమ సేవలు అందించడంపై సింగపూర్ ప్రభుత్వం శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు సింగపూర్ హోం మంత్రి షణ్ముగంతో మంత్రులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సింగపూర్ లో ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలు, ఆ దేశ చట్టాలపై రాష్ట్ర మంత్రులకు షణ్ముగం వివరించారు. సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయంలో సమీకృత ప్రణాళికలు, భవిష్యత్ పట్టణ ప్రణాళికలు, పాలన అంశాలపై నిర్వహించే శిక్షణలో మంత్రులు పాల్గొంటారు. అనంతరం సింగపూర్ సిటీ గ్యాలరీను సందర్శించి సింగపూర్ పట్టణ ప్రణాళిక, గత 50 ఏళ్లలో సింగపూర్ ఎలా అభివృద్ధి చెందిందనే అంశంపై మంత్రులు అధ్యయనం చేయనున్నారు.

---------------------------

వేసవిలో నీటి కొరతను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి ఆంజనేయులు తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, వినుకొండలోని సింగర చెరువును పూర్తిగా నింపినట్లు తెలిపారు. గ్రామాల్లో తగినంత తాగునీటి సరఫరా కోసం 'జలధార' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే 'పీఎం సూర్య ఘర్' పథకం ద్వారా గృహాలపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసి, స్వయం విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని తెలియజేస్తూ...

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రైతుల నుంచి ధాన్యం సేకరణకు 210 రవాణా వాహనాలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలోని ప్రతి రైతు సేవాకేంద్రం వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని రైతులు దళారులను నమ్మకుండా నేరుగా కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి విక్రయించాలని మంత్రి సూచించారు.

---------------------------

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం మహిళా సాధికారతను వ్యతిరేకించడమేనని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందరేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నారీశక్తి వందన అదినియం, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై నిన్న పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

నారీశక్తి బిల్లు మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే నిర్ణయాధికారంలో మహిళలకు సముచిత స్థానం దక్కేదని పురందరేశ్వరి తెలుపుతూ..

వాయిస్..30.. సెకన్లు

---

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు ఈరోజు కన్నుమూశారు. వయోసంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1935 జూన్ 23న గుంటూరులో నాదెండ్ల భాస్కరరావు జన్మించారు. ఆయన వయస్సు 90 ఏళ్లు. 1978లో కాంగ్రెస్ నుంచి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 1984లో నెలరోజుల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఎన్టీ రామారావు, మర్రిచెన్నారెడ్డి, టి.అంజయ్య ప్రభుత్వాల్లో మంత్రిగానూ పనిచేశారు.

---

తూర్పుగోదావరి జిల్లాలో ఈరోజు జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. జిల్లాలోని నల్లజర్ల మండలం వీరవల్లి టోల్‌గేట్ వద్ద ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న కారు ప్రమాదవశాత్తూ సూచిక బోర్డు స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. మరో వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయని తెలిపారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

---

పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందేందుకు పౌష్టికాహారం తప్పనిసరిని అని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని పౌష్టికాహార ప్రాధాన్యత గురించి తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వినియోగం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. గర్భిణీలు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

---

రాష్ట్రంలోని పాఠశాలలకు ఈ నెల 24 వ తేదీ నుంచి వేసవి సెలవులను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. జూన్ 12 వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని తెలిపింది. వేసవి సెలవుల నేపథ్యంలో ఎండ తీవ్రత, చెరువులు, కాలువల వద్ద జరిగే ప్రమాదాల నివారణకు జిల్లా విద్యాధికారులకు పలు సూచనలు జారీ చేసింది. విద్యా సంవత్సరం చివరి రోజులోపు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు భద్రతా చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించింది. పాఠశాల నోటీసు బోర్డులపై భద్రతా నియమాలను ప్రదర్శించాలని, తల్లిదండ్రులకు సూచనలు చెప్పి, పిల్లలపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని పేర్కొంది.

---

దేశంలోని వివిధ రాష్ట్రాల వైవిధ్య భరితమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సహజ పర్యాటక ప్రాంతాలపై నీతి ఆయోగ్ రూపొందించిన 'దివ్య భారత్ – ఏ విండో టు ది సోషల్ ఆఫ్ ఇండియా' నివేదికను నిన్న విడుదల చేసింది. ఇందులో 13 పేజీల సమగ్ర నివేదిక, ఒంటి గంటా 20 నిమిషాల నిడివి ఉన్న ప్రత్యేక వీడియో ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక గమ్యస్థానాలను ప్రత్యేకంగా ప్రస్తావించింది.

====================